క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

కందుకూరు: కందుకూరు ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ పెద్దన్నశెట్టి తెలిపారు. ప్రయాణికులు కార్యక్రమంలో పాల్గొని సంస్థ అభివృద్ధికి, మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో పాల్గొనే వారు 9959225698 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

నేడు ఉలవపాడులో జగనన్న సురక్ష

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడులోని 3 సచివాలయ పరిధిలో గురువారం జగనన్న సురక్ష జరుగుతుందని ఎంపీడీఓ చెంచమ్మ తెలిపారు. ఉదయం 9 గంటలకు క్యాంపు ప్రారంభం అవుతుందన్నారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు హాజరుకావాలని కోరారు.

పొగాకు అత్యధిక ధర రూ. 257

కందుకూరు: పొగాకు వేలం చివరికి చేరే కొద్ది పొగాకు ధరలు పెరుగుతూ పోతున్నాయి. బుధవారం జరిగిన పొగాకు వేలంలో పొగాకు ధర మరోసారి పెరిగింది. ఈ సీజన్‌కు రికార్డు స్థాయిలో కేజీ పొగాకు రూ.257 నమోదైంది. కందుకూరు-1వ వేలం కేంద్రంలో 911 బేళ్లను వేలానికి ఉంచగా 835 బేళ్లు, కందుకూరు-2 వేలం కేంద్రంలో 815 బేళ్లకు గాను 743 బేళ్లు అమ్ముడుపోయాయి. ఒకటో వేలం కేంద్రంలో కేజీ పొగాకు అత్యధికంగా రూ.257 ధర పలికింది. రెండో వేలం కేంద్రంలో రూ.255 వచ్చింది. ఇక బుధవారం కేజీ పొగాకు అత్యల్ప ధరలు వరుసగా రూ.160, రూ.157 నమోదయ్యాయి.

సీపీఎం శిక్షణ తరగతులు విజయవంతం చేయండి

కందుకూరు: ఈ నెల 29, 30 తేదీల్లో కందుకూరు పట్టణంలో జరిగే సీపీఎం నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ఏ గౌస్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజా సమస్యల పరిష్కార మార్గాలు, ప్రభుత్వ విధానాలు అనే అంశంపై శిక్షణా తరగతులు జరుగుతాయని, ఈ తరగతులకు పార్టీ ముఖ్య నాయకులు సిద్ధయ్య, జీవీ కొండారెడ్డి, హరి, మోహన్‌రావు తదితరులు పాల్గొంటారని, నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఐటీఐకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు రూరల్: పట్టణంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం రెండో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ హర్షవర్ధన్ తెలిపారు. ఈ నెల 31 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. లేకుంటే 31న సాయంత్రం 3 గంటల లోగా కాలేజీలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. 4 న కౌన్సెలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కందుకూరు రూరల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ రమణయ్య తెలిపారు. మండల పరిధిలోని ఓగూరులో బుధవారం జగనన్న స్వచ్ఛ సంకల్పం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతిరోజూ తడిచెత్త, పొడిచెత్తను సేకరించి చెత్త నుంచి సంపదను తయారు చేయాలని సూచించారు. కాల్వల్లో బ్లీచింగ్‌ను తరలించాలన్నారు. కుళాయి ద్వారా నీటి నిర్వహణ గురించి వివరించారు. పంచాయతీ కార్యదర్శి మాల్యాద్రి రావు, సచివాలయ సిబ్బంది , అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

మండలంలో మోస్తారు వర్షం

పామూరు: మండలకేంద్రమైన పామూరు, వగ్గంపల్లె, రావిగుంటపల్లె, మార్కొండాపురం, నిమ్మచెట్లపల్లె, భూమిరెడ్డిపల్లి, బొట్లగూడూరు, లక్ష్మీనరసాపురంతో పాటు పలుగ్రామాల్లో బుధవారం మోస్తారు వర్షం కురిసింది. వర్షంతో బత్తాయి, నిమ్మ తోటలకు మేలు చేకూర్చగా చెక్‌డ్యాంమ్‌లకు కొద్దిమేర నీరు చేరింది.

ఘనంగా చిన షరిగత్ వేడుకలు



మయాన మకాన్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్



పీర్లకు ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కనిగిరి రూరల్: ఇమామే హసేన్, ఇమామే హుస్సేన్, ఇమామే ఖాశిం వంశీకుల త్యాగనిరతికి ప్రతీకగా నిర్వహించే మొహర్రం(పీర్ల పండుగ) చిన షరిగత్తు వేడుకలను కనిగిరిలో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మయాన మాకాన్(పఠాన్ పీర్ల చావిడి) సయ్యద్ మకాన్‌లలో జరిగిన విశిష్ట పూజల్లో ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొన్నారు. సయ్యద్ మకాన్‌లో హజరత్ ఇమామే ఖాశింకు జరిగే ×సేరా బాంద్‌ౕ కార్యక్రమంలో, మయాన మకాన్‌లో పీర్లకు జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ అల్లాహ్ కృపతో సర్వమానవాళి సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. మొహర్రం వేడుకలను అందరూ ఆనందంగా జరుపుకోవాలన్నారు. అనంతరం మయాన మకాన్ ముజావర్లు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. తొలుత ముజావర్లు ఎమ్మెల్యే బుర్రాను తప్పెట్ల తాళాలతో బాణసంచా కాల్చి ఘనంగా స్వాగతించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సయ్యద్ రిజ్వాన ఖాలక్, సింగిల్ విండో చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, సర్పంచ్ నాగేంద్రారెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ చిమ్మిడిశెట్టి శ్రీనివాసుల నాయుడు, ముజావర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పామూరు: మొహర్రం (పీర్లపండుగ)లో భాగంగా బుధవారం చినషరిగత్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక నెల్లూరురోడ్డు, కందుకూరు రోడ్డులలో ఉన్న పీర్లచావిళ్ల వద్ద నుంచి పీర్లను మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో భక్తిశ్రద్ధలతో వైభవంగా ఊరేగించారు. పీర్లకు భక్తులు నైవేద్యం సమర్పించగా పీర్లతో ముజావర్లు భక్తులను ఆశీర్వదించారు. హిందు, ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు

గుర్రప్పడియ(కొండపి): గ్రామాల్లో హర్ ఘర్ జల్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్‌కే రసూల్ తెలిపారు. మండలంలోని గుర్రప్పడియ గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్, హర్ ఘర్ జల్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో ఏఈ రసూల్ మాట్లాడారు. గుర్రప్పడియలో కుళాయిల ఏర్పాటుకు రూ.6.75 లక్షలతో పైప్‌లైన్ నిర్మించి ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా మంచినీరు అందిస్తామని పేర్కొన్నారు. అదే విధంగా ముప్పరాజుపాలెం, పెరిదేపి గ్రామాలకు సైతం హర్ ఘర్ జల్ పథకం ద్వారా మంచినీరు సరఫరా చేస్తామని చెప్పారు. గ్రామ పంచాయతీకి హర్ ఘర్ జల్ పథకానికి సంబంధించిన సర్టిఫికెట్ అందజేశామన్నారు. కార్యక్రమంలో డీపీఎం బృందం సభ్యులు హరికృష్ణ, డి.రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూస్ ఏఈ రసూల్

శివారు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

- మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: దశల వారీగా పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక 11వ వార్డులోని అర్బన్ కాలనీలో బుధవారం సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్‌మాట్లాడుతూ శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తక్షణ పారిశుధ్య చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దాసరి మురళీ కృష్ణా, మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ షరీఫ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

అలాగే పట్టణంలోని 20వ వార్డు ఇందిరా కాలనీలో అకాల వర్షం కారణంగా మంగళవారం రాత్రి విద్యుత్ స్తంభం పడిపోయింది. ప్రజల విన్నపం మేరకు తక్షణం స్పందించిన చైర్మన్ గఫార్, నూతన విద్యుత్ పోల్‌ను ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ దీప, విద్యుత్ ఏఈ పవన్ కుమార్, ఎల్ ఐ వెంకటయ్య, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీగా సింగరాయకొండ పీహెచ్‌సీ!

- అందుకు తగిన మౌలిక వసతులున్నాయి
- వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎన్ మూర్తి

సింగరాయకొండ: స్థానిక ఉన్నతశ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చడానికి అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు ఉన్నాయని వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎన్ మూర్తి పేర్కొన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చడంపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయడానికి బుధవారం ఆయన పీహెచ్‌సీని పరిశీలించారు. డాక్టర్ ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ.. ఇటీవల కొండపిలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సింగరాయకొండ పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారన్నారు. ఈ నేపథ్యంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు వచ్చానని తెలిపారు. ఆస్పత్రిలో కొన్ని అదనపు నిర్మాణాలు చేపడితే సీహెచ్‌సీగా మార్చవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో ఉందని సీహెచ్‌సీగా మారితే వైద్య విధాన పరిషత్ పరిధిలోకి వస్తుందన్నారు. వాస్తవానికి 70 వేలకు పైగా జనాభా ఉన్న ప్రాంతంలో సామాజిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు అవకాశం ఉందని, ఈ మండలంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో సుమారు లక్షకు పైగానే జనాభా ఉన్నారన్నారు. ఈ ఆస్పత్రిని సీహెచ్‌సీగా మారిస్తే చిన్న పిల్లల వైద్యులు, స్త్రీ వైద్య నిపుణులు, అనస్తీషియన్ డాక్టరు, ఎముకల డాక్టర్‌తో పాటు నర్సింగ్, ఇతర సిబ్బంది అందుబాటులోకి వస్తారని వివరించారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.చైతన్యకృష్ణ, ల్యాబ్ టెక్నీషియన్ మహేంద్ర, ఫార్మసిస్టు పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.



ఆస్పత్రిని పరిశీలిస్తున్న వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎన్ మూర్తి

గొర్రెల కాపరుల సమస్యలు పరిష్కరించాలి

టంగుటూరు: గొర్రెల కాపరుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో బుధవారం జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ బొట్ల రామారావు కలిసి విజ్ఞప్తి చేశారు. గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల్లో 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని, పశువుల రక్షణకు షెడ్ల నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు 90 శాతం రాయితీతో మంజూరు చేయాలని కోరారు. ఎన్‌సీడీసీ గ్రాంటు విడుదల చేసి 50 శాతం రాయితీతో గొర్రెల యూనిట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ వినతిపై సజ్జల సానుకూలంగా స్పందించారని బొట్ల రామారావు తెలిపారు. యన్నాబతుల వెంకట సుబ్బయ్య, వేమా ఆంజనేయులు ఉన్నారు.



సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బొట్ల రామారావు

ఈ–క్రాప్ నమోదు నిష్పక్షపాతంగా చేయాలి



మద్దిపూడిలో మాట్లాడుతున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి



ఈ క్రాప్ నమోదుపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నిర్మలకుమారి



టంగుటూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ సంజీవరావు

- ఎంపీపీ వాకా వెంకటరెడ్డి

మద్దిపూడి: ఖరీఫ్ సీజన్‌లో ఈ–క్రాప్ నమోదు నిష్పక్షపాతంగా చేయాలని ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు, మద్దిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి సూచించారు. మండంలోని గుండ్లసముద్రం రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం ఈ–క్రాప్ నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. 2022 సంవత్సరానికి సంబంధించి మండలంలోని 6718 మంది రైతుల ఖాతాల్లో రూ.36.77 కోట్ల వైఎస్సార్ ఉచిత పంటల బీమా నగదును జమ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా అధికారులు పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని సూచించారు. జిల్లా వ్యసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ పంట నమోదు, పీఎం కిసాన్ పథకంలో ఈకేవైసీ పెండింగ్ ఉన్న రైతులు, కౌలు పత్రాల పంపిణీ తదితర విషయాలపై వీఏఏలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ సీహెచ్ వెంకటేష్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదుతో రైతులకు ప్రయోజనం

సింగరాయకొండ: వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటలను తప్పనిసరిగా ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని ఏడీఏ ఈ.నిర్మల కుమారి తెలిపారు. స్థానిక మండల కాంప్లెక్స్‌లోని ఆర్‌బీకే-3లో బుధవారం వివిధ శాఖల అధికారులతో ఈ క్రాప్ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ.. రైతు భరోసా, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపరిహారం పొందడానికి ఈ–క్రాప్ తప్పనిసరి అని తెలిపారు. ఖరీఫ్ పంటలను సెప్టెంబర్ 20వ తేదీలోగా ఈ క్రాప్ చేసుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారి సుధాకర్, హార్టికల్చర్ అధికారి తేజ, వీఆర్‌ఓలు, సర్వేయర్లు, వీఏఏలు, వీహెచ్ఏలు, వీఐసీలు పాల్గొన్నారు.

పంట నమోదులో జాగ్రత్తలు పాటించాలి

టంగుటూరు: పంట నమోదు సమయంలో పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ సంజీవరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2023-24 ఖరీఫ్ పంటల ఈ క్రాప్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. వీఆర్వో, సర్వేయర్, గ్రామ వ్యవసాయ సహాయకులు సమన్వయంతో పంట నమోదు పూర్తి చేయాలని చెప్పారు. వ్యవసాయాధికారిణి స్వర్ణలత మాట్లాడుతూ.. కౌలు రైతుల పంటలను కూడా ఈ క్రాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఏఎస్ఓ శ్రీవాణి, అన్ని గ్రామాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సులభతర విద్యాబోధన చేయాలి

సీఎస్‌పురం (పామూరు): ఉపాధ్యాయులు ఆధునిక బోధనా పద్ధతుల్లో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభతర విద్యా బోధన చేయాలని మార్కాపురం డిప్యూటీ డీఈఓ ఎ.చంద్రమౌళీశ్వర్ అన్నారు. మండలంలోని నల్లమడుగుల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో బుధవారం స్కూల్‌కాంప్లెక్స్ సమావేశం చైర్మన్ జి.లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశ ప్రాధాన్యతను వివరించారు. పాఠశాల హెచ్ఎం బుడాల డేవిడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండలంలోని ఉప్పలపాడు ప్రభుత్వపాఠశాలను ఎంఈఓ జె.ప్రసాదరావు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను పరిశీలించి స్మార్ట్‌టీవీ తరగతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తిని పలు సూచనలు చేశారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర్

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

హనుమంతునిపాడు: పక్కా ఇళ్ల నిర్మాణాల పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తయ్యేట్లు చూడాలని ఏఓ క్రిష్ణారావు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్‌ఓలు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి ప్రధాన మంత్రి అవాజ్ యోజన కింద 531 ఇళ్లు మంజూరు కాగా 259 మంది లబ్ధిదారులు పనులు ప్రారంభించగా 29 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలన్నారు. హౌసింగ్ ఏఈ కొండయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ క్రిష్ణారావు

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

టంగుటూరు: స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సరోజ్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా 1,000 నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి ప్రజా నాట్యమండలి వ్యవస్థాపకులు నల్లూరి వెంకటేశ్వర్లు హాజరై ఫౌండేషన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సరోజ్ సేవా ఫౌండేషన్ అధ్యక్షులు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు చిడిపోతు వెంకటేశ్వర్లు, ఉన్నం వెంకట సుబ్బయ్య, కారుమంచి సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

28న ముహూర్తం ఖరారు

కందుకూరు: కందుకూరు గ్రామదేవత అంకమ్మతల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్టా మహోత్సవం ఈనెల 28వ తేదీన ఖరారు చేయనున్నట్లు ఆలయ పునర్నిమాన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు నెల్లూరుకు చెందిన ప్రముఖ సుబ్బయ్యశాస్త్రి సిద్ధాంతి శుక్రవారం ఆలయం వద్దకు వస్తారని, ఆ రోజు విగ్రహ ప్రతిష్ట మహోత్సవ తేదీని నిర్ణయిస్తూ లగ్న పత్రిక రాస్తారని తెలిపారు. శ్రావణమాసంలో నూతన ఆలయాన్ని ప్రారంభించాలని ఇప్పటికే నిర్ణయించామని, ఈ ఉత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సంకల్పంతో భక్తులు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి విరాళాలు ఇచ్చారని, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆలయ పునర్నిమానం అద్భుతంగా జరిగిందని వివరించారు.

యువకుడిపై బీర్ సీసాతో దాడి

కొండపి: స్థానిక అనకర్లపూడి రోడ్డులో ప్రభుత్వ మద్యం దుకాణం వెనుక నిర్వహిస్తున్న ఓ హోటల్లో బుధవారం ఇద్దరు యువకులు పూటుగా మద్యం తాగి ఘర్షణపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. అనకర్లపూడి గ్రామానికి చెందిన శ్రీను అనే యువకుడు కొండపిలోని టంగుటూరు రోడ్డులో ఉన్న ఓ హోటల్లో వంటమాస్టర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం అతని పుట్టినరోజు కావడంతో అదే హోటల్లో పనిచేస్తున్న మరో యువకుడితో కలిసి మద్యం తాగేందుకు స్థానిక అనకర్లపూడి రోడ్డులోని ఓ హోటల్‌కు చేరుకున్నారు. ఇద్దరూ మద్యం తాగిన తర్వాత పాత విషయాలపై చర్చించుకుంటుండగా మాటామాటా పెరిగింది.

ఈ క్రమంలో శ్రీను తలపై బీర్‌బాటిల్‌తో తన వెంట వచ్చిన యువకుడు బలంగా మోదడంతో గాయాలయ్యాయి. శ్రీనును తన బంధువులు ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఘర్షణ జరిగిన విషయం వాస్తవమేనని, ఫిర్యాదు అందితే కేసు నమోదు చేస్తామని ఎస్సై రమణయ్య తెలిపారు.

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు

గుడ్లూరు: గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా చర్యలు తప్పవని కందుకూరు డీఎస్పీ రామచంద్ర హెచ్చరించారు. మండలంలోని పాజర్లలో ఆయన బుధవారం పర్యటించారు. గ్రామంలోని ప్రజలతో సమావేశం నిర్వహించి పలు అంశాలను వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణం ఉన్నపల్లెలో క్షణికావేశంలో జరిగే చిన్నచిన్న గొడవలు పెద్ద ప్రమాదాలకు దారి తీస్తున్నాయన్నారు. మద్యం మత్తులో గొడవల వలన ప్రాణాలు తీసుకునేస్థాయికి వెళ్లి ఆ కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. దీని వలన వర్గాలు ఏర్పడి గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలుగుతుందని తెలిపారు. గ్రామస్తులంతా ఎలాంటి గొడవలు లేకుండా కలసిమెలసి ఉండాలని తెలిపారు. సమస్యలు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. గ్రామంలో రెండు నెలల క్రితం జరిగిన హత్య కేసు గురించి విచారణ చేశారు. ఆయన వెంట సీఐ సుబ్బారావు, ఎస్సై ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

కుమార్తె కనబడటం లేదని ఫిర్యాదు

దర్శి: తన కుమార్తె కనబడటం లేదని చిన్న ఉయ్యాలవాడకు చెందిన గాలం ఏడుకొండలు దర్శి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. అతని కుమార్తె, అల్లుడు వెంకటేశ్వర్లు ఈ నెల 19వ తేదీ రాత్రి దినచర్య పూర్తిచేసుకుని నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారుజామున 3 గంటలకు లేచి చూడగా తన భార్య కనిపించలేదని ఏడుకొండలుకు వెంకటేశ్వర్లు తెలిపాడు. అప్పటి నుంచి మామ, అల్లుడు, బంధువులు కలిసి ఆమె కోసం వెతికారు. కనిపించకపోవడంతో బుధవారం దర్శి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

దర్శి: మండలంలోని పోతవరం గ్రామానికి చెందిన ఓ మహిళ తన భర్త లక్కెపోగు రత్నబాబు తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన మహిళకు దర్శి మండలం పోతవరం గ్రామానికి చెందిన లక్కెపోగు రత్నబాబుతో 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక పాప, ఒక బాబు సంతానం కాగా, రత్నబాబు వ్యసనాలకు బానిసై నిత్యం మద్యం సేవించి భార్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. రత్నబాబుకు మరొక మహిళతో వివాహేతర సంబంధం కూడా ఉందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

బడిబయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

సింగరాయకొండ: బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ బి.శివన్నారాయణ ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని 9 ప్రైవేట్ పాఠశాలలతోపాటు గురుకుల పాఠశాల రికార్డులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. సాంకేతిక సమస్య కారణంగా ప్రైవేటు పాఠశాలల రికార్డుల్లో చోటుచేసుకున్న తప్పిదాలను సరిచేయాలని చెప్పారు. ఎంఈఓ-2 ఆవుల శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రాపౌట్లను గుర్తించండి

ఉలవపాడు: డ్రాపౌట్లను ఉపాధ్యాయులు గుర్తించాలని ఎంపీడీఓ చెంచమ్మ తెలిపారు. అందులో భాగంగా బుధవారం ఎంపీడీఓ..ఎంఈఓ ప్రసాదరావుతో కలసి సాయిహైస్కూల్, సెయింట్‌జోసఫ్స్ పాఠశాలలోని విద్యార్థుల వివరాలను పరిశీలించారు. మండల పరిధిలోని 16 సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పాఠశాలలను సందర్శించి బడిలో లేని విద్యార్థులను గుర్తించాలని తెలిపారు. ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశానికి హాజరయ్యారు. ఉపాధ్యాయులు విద్యార్థుల నోటు పుస్తకాలను కరెక్షన్ చేయాలన్నారు. ఎంఈఓ 2 రమణయ్య అలగాయపాలెంలోని కాంప్లెక్స్ సమావేశానికి హాజరయ్యారు. విద్యార్థుకు ఇంటి పనులు ఇవ్వాలని తెలిపారు.



సింగరాయకొండలో ప్రైవేట్ పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓ



డ్రాపౌట్ల వివరాలు సేకరిస్తున్న ఎంపీడీఓ చెంచమ్మ